తిండి దుర్లభమౌతోంది. వీటన్నిటికంటె నీచాతినీచమైన పలుకులు చాలా బాధాకరంగా తోచినయి. తనేమీ తెలివితక్కువదిగాదు, చదువులేనిదిగాదు, రూపము లేనిది గాదు. ఆయన చెప్పిన సలహాను అమలులోనికి తేవడానికి నిశ్చయంచేసుకుంది. కాని కొంత పెట్టుబడి కావాలికదా! మంచిదుస్తులు, సంచి, కలము, ఆభరణాలు (రోల్డుగోల్డువైనా ఫరవాలేదు) యిలాంటివి. మర్నాడు ప్రొద్దున్నే తను పని చేసే యిండ్లల్లో ఎలాగో వందలకొలది అబద్ధాలతో వంచించి పదేసి రూపాయల చొ॥న అన్ని యిండ్లల్లోనూ అప్పుగా తీసుకుంది, మర్నాడే నూతన ప్రదేశంలో కాలుపెట్టింది. అన్ని హంగులు ఏర్పాటుకు సామగ్రికొన్నది. (అతిచౌకరకమైనవి). ఒక శ్రీమంతులమేడలో ప్రవేశించింది, గేటువద్దనున్న గూర్ఖా శాల్యూట్‌ను కూడా పొంది.

ఇప్పుడామె శాంతమ్మకాదు. మిస్. సుహాసిని. బెనారస్ సిల్కుచీరె, పట్టురవికె (వేలంపాట దుస్తులే సుమండి), రోల్డ్‌గోల్డ్ నెక్‌లెస్, హాండ్‌బాగ్, సెకండ్‌హాండ్ రిస్టువాచి, అతి చౌకరకమైన చెప్పులజత (పైకి అందంగానే కనిపిస్తయి) నరవాహనం (రిక్షా). కడుపులోకి మాత్రం మున్సిపాలిటీ ధర్మాన పంపునీళ్లు దండిగా పట్టించింది. మేడలోకి ప్రవేశిస్తూ నమస్తే అంది అతివయ్యారంగా. పడకకుర్చీలో కూర్చొని కాఫీ సేవిస్తున్న శ్రీమంతుడు ప్రతి నమస్కారంచేసి, కళ్లద్దాలొకసారి సవరించుకొని 'అలా కూర్చోండి' తమపేరు, తమరు వచ్చినపని .... ఖంగారవుతున్నాడు, అకస్మిక నూతన యువతి ఆగమనమునకు. మరుక్షణములోనే దాసీదానిచే మరొక కప్పు కాఫీ తెప్పించి 'దయచేసి పుచ్చుకోండి' అంటూ ఆమెముందుకు త్రోశాడు. 'Thanks' అంటూ కడుపార త్రాగి, 'అబ్బే ఎందుకండీ మీ కీ శ్రమ, యిప్పుడే పుచ్చుకొని (పంపు నీళ్ళు) బయలుదేరానండీ అంటూనే. తమపేరుప్రఖ్యాతులు వినడమేగాని (నిజానికి ఆయనెవరోతెలీదు. ఆయనపేరు అంతకు ముందే తెలిసుదు) మీదర్శన భాగ్యం లభింపలేదు. ఈరోజు తమదర్శనంకోసం ప్రత్యేకంగా హైదరాబాదునుండి వచ్చాను. 'అలాగా? ఏమిటీ విషయం?' అంటూ ఫాన్ స్విచ్‌వేశాడు అతిధి గౌరవార్థం. 'చూడండి! భారతదేశంలో స్త్రీజాతి చాలా వెనుకబడివున్న సంగతి జగద్విదితమే. అందులో మన ఆంధ్రుల్లో మరీ హీనంగా వుంది. అందుకని జీవితం ఆదర్శ మహిళల పురోభివృద్ధికొరకే అంకితం చేశాను సుమండీ! హైదరాబాదులో 'ఆంధ్ర మహిళా సంఘానికి నన్ను కార్యదర్శినిగా ఎన్నుకొన్నారు' అంటూండగానే 'చాలా సంతోషం' అంటూ షేక్‌హాండ్ యివ్వడానికి ఆమెచేతిని పట్టుకోబోయాడు. ఫరవాలేదు తర్వాతవినండి. మా సంఘానికి వార్షికోత్సవ ప్రోగ్రాము నిర్ణయించాము. మరో 4 రోజుల్లో టపాలో మీకు ప్రోగ్రాంపేపరు, యిన్విటేషన్‌కార్డు పంపగలం. అప్పుడు మీరు తప్పకవచ్చి మా సంఘాన్ని ఆశీర్వదించి వెళ్ళాలి. 'ఓ అలాగేతప్పకుండా. ఇప్పుడు నేను ముఖ్యంగా నేను వచ్చినపని మీ బోటి సంఘాభిమానుల సహకారార్థం, యీ బ్రహ్మాండమైన ప్రోగ్రాములో క్లబ్ లైబ్రరీ, రేడియోలు నూతనంగా స్థాపించడానికి నిశ్చయమైంది. అన్నిఖర్చులూ కలిసి కనీసం 5 వేలన్నా కావచ్చని ఎస్టిమేషన్ తయారయింది. కాబట్టి యీ కార్యక్రమం మీలాంటివారిసహకారమేలేకపోతే ఒక్క అడుగు కూడా ముందుకువేయలేవీసంఘాలు. కావున, మీకుతోచిన.... అంటూండగానే 'ఓ.... ఇదుగో చెక్కు. కాని, ఇది చాలా స్వల్పం. మరొకసారి వస్తే తప్పకుండా మరికొంత విరాళమివ్వగలను' అంటూ చేతికందించాడు. మిస్. సుహాసిని (శాంతమ్మ) ఆదుర్దాతో చెక్కుమీది అంకెనుచూచి తృప్తిగా ఒక్క పెద్ద నిట్టూర్పు వెలిబుచ్చింది. 'ఏమిటది' అంటూ విస్తుపోయాడా బోలా శంకరయ్యగారు.

'అబ్బే ఏమీలేదు–మీ దాతృత్వానికి నాకు చాలా తృప్తికలిగింది. మీ మేలు ఎప్పుడూ మరువలేము. తప్పకుండా వార్షికోత్సవానికి రావాలి సుమండీ' అంటూ లేచినిల్చుంది. 'అదేమిటి భోజనం చెయ్యకుండానే.' కాదు ఎంతమాత్రం వీల్లేదు. మీరీపూట మాయింట్లో తప్పకుండా భోజనంచేసి వెళ్ళాలి' అంటూ ప్రార్థనాపూర్వకంగానే కోరాడు పాపం. ఆయన కోరికను సమ్మతించింది మిస్. సుహాసిని.

తిరిగి రిక్షాలో వస్తూ, మళ్లీ చెక్కుమీది అంకెనుచూచి పొంగిపోయింది. కాస్తా కూస్తా కాదు 1500 అక్షరాలా పదిహేను వందల రూపాయలు. తనజీవితంలో ఎప్పుడూ (తన భర్త జీవించి ఉన్నప్పుడుగూడా) యింత మొత్తాన్ని ఒక్కసారిగా చూడనూ లేదు పొందనూలేదు. యీ సంఘటనంతా ఒక కలగా జరిగింది. కాని, యీ సలహానిచ్చిన తనభర్తయజమానిని మనస్సులోఅభినందించకుండా వుండలేకపోయింది.

ఇప్పుడు శాంతమ్మ మరో క్రొత్తప్రదేశంలో నివాసమేర్పరచుకొంది. జీవితనాటకంలోని వేషమూ, పేరు పోయినయి. మిస్ సుహాసినిగా గాక మామూలు శాంతమ్మగానే, నిర్విచారంగా కాలం వెళ్లబుచ్చుతోంది.

★


## కాలు ఆణి మందు

కాళ్లలో యేర్పడు ఆణికి యీ దివ్యమైన ఔషధమును ప్రతిరోజు పైన చరుముకొని వచ్చినచో ఆణియొక్క మొలకను బయటికి తీసివైచి స్వస్థపరచును. మరల యెప్పటికిని కాలిలో ఆణి రానేరదు. బాగుగ మామూలు ప్రకారము పాదములు అణచి నడచుటకు వీలుపడును.

బుడ్డి 1-8 రూ. 1=00

ధనలక్ష్మి అండ్ కో.,

తపాల్‌పెట్టె నెం. 1376, మదరాసు-1.


